

పోషణ్ పక్వాడాతో సంక్షేమం

బాలికలు, యువతుల సంక్షేమానికి పోషణ్ పక్వాడా కార్యక్రమం దోహదపడుతుందని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. 8లో



ముంచెత్తిన వాన

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తాయి. జన జీవనం స్తంభించింది. 8లో



కాఫీ రైతులకు మెరుగ్గా ఆదాయం

కాఫీ రైతులకు ఆదాయం పెంపు లక్ష్యంగా సేవలందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో

విశాఖ పర్యాటక వైభవం

- జీఐఎస్‌లో రూ.8,806.44 కోట్లతో ప్రాజెక్టులకు ఎంవోయూలు
- 18,205 మందికి ఉపాధి అవకాశాలు
- అల్లూరి జిల్లాలోను పర్యాటకం పరుగులు
- 64 ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం : ప్రకృతి అందాలతో అలరారే విశాఖ పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా పలు ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. దేశీ, విదేశీ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న విశాఖలో ఉన్న టూరిజం స్థలాలను వినియోగంలోకి తీసుకువస్తూ.. జలక్రీడలు, సాహస పర్యాటకం, బీచ్ టూరిజం, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం.. ఇలా భిన్నమైన సెగ్మెంట్లలో అభివృద్ధికి అడుగులు వేస్తోంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 64 ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. మొత్తం రూ.8,800 కోట్లకుపైగా ప్రాజెక్టుల ద్వారా 18 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఈ ప్రాజెక్టుల గ్రౌండింగ్ చేసే విషయంలోనూ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది.



అరకులో వలిసె అందాలు



టన్నెల్ అక్వేరియం



అనంతగిరిలో రిసార్టులు

అల్లూరి జిల్లాకూ అద్భుత అవకాశాలు

అరకు, పాడేరు ప్రాంతాల్లోనూ భారీ ప్రాజెక్టులు రానున్నాయి. అల్లూరి జిల్లా పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు టూరిస్టుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లోనూ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. మారేడుమిల్లిలో రూ.1000 కోట్లతో తులి హోటల్స్ ప్రై.లిమిటెడ్ సంస్థ సఫారీ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేసి 1000 మందికి ఉపాధి కల్పించనుంది. విశాఖ–అరకు రోడ్‌లో మైస్టిక్స్ పామ్స్ సంస్థ రూ.50 కోట్ల పెట్టుబడితో గోల్ఫ్ రిసార్ట్ అండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది.

18 వేల మందికి ఉపాధి

ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. మొత్తంగా పర్యాటక రంగానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.21,941 కోట్లతో 129 ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగ్గా.. ఇందులో సగంవరకు అంటే 64 ప్రాజెక్టులు ఉమ్మడి విశాఖకు సంబంధించినవి కావడం విశేషం. మొత్తం రూ.8,806. 44 కోట్లతో విభిన్న రకాల ప్రాజెక్టులు రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 18,205 మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి కలగనుంది.

దీని ద్వారా 250 మందికి ఉపాధి కలగనుంది. రూ.243 కోట్లతో 1000 మందికి ఉపాధి కల్పించేలా అనంతగిరి హిల్స్‌లో ఎకో–ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్ సంస్థ రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్‌థీమ్ పార్క్ ఏర్పాటు చేయనుంది. రూ.150 కోట్లతో అరకులో ది రిప్పిల్స్ సంస్థ రిసార్టులు, విల్లాలు ఏర్పాటు చేసి 150 మందికి పైగా ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. వీటితో పాటు కాంపింగ్, కారావాన్ పార్క్, అడ్వెంచర్ స్పోర్ట్స్, లగ్జరీ కాటేజీలు, వుడెన్ హౌస్‌లు, మల్టీ క్యుజిన్ రెస్టారెంట్స్ కూడా రాబోతున్నాయి.

కొత్త ప్రాజెక్టులతో కొత్త కళ



పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న ఎంవోయూలు గ్రౌండ్ అయ్యేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక ప్రాజెక్టుల కోసం టూరిజం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఏపీ సంస్థ ఎంవోయూ చేసుకుంది.. ఆ ప్రాజెక్టుకు సరిపడా స్థలాన్వేషణ, చర్చలు, మొదలైన అంశాల్ని ఈ కమిటీ పర్యవేక్షించి.. వీలైనంత త్వరగా ప్రాజెక్టు పట్టాలెక్కేలా చర్యలు తీసుకోనున్నాం. ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి.. దేశ విదేశీ సందర్శకుల్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు త్వరలోనే అమలు కానున్నాయి.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

విశాఖలో రాబోతున్న ముఖ్యమైన ప్రాజెక్టులివీ..

- సుమారు రూ.300 కోట్లతో 300 మందికి ఉపాధి కల్పించేలా ఒబెరాయ్ హోటల్స్ సంస్థ అన్నవరం సమీపంలో ఒబెరాయ్ హోటల్‌ని నిర్మించనుంది.
- రూ.208 కోట్లతో డెహ్రాడూన్‌కు చెందిన దేవ్‌భూమి రోప్‌వేస్ సంస్థ వివిధ పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 50 మందికి ఉపాధి కలగనుంది.
- రూ.1000 కోట్లతో 6,500 మందికి ఉపాధి కల్పించేలా డ్రీమ్‌వ్యాలీ గ్రూప్ సంస్థ గోల్ఫ్‌గేటెడ్ కమ్యూనిటీ విత్ 5 స్టార్ రిసార్ట్స్‌ని కట్టనుంది.
- రూ.300 కోట్లతో 750 మందికి ఉపాధి కల్పించేలా ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండస్ట్రీస్ కంపెనీ 7 స్టార్ హోటల్‌ని నిర్మించనుంది.
- రూ.500 కోట్లతో 250 మందికి ఉపాధినిస్తూ మంజీరా హోటల్స్ సంస్థ హోటల్, రిసార్టు నిర్మించేలా ఒప్పందం కుదుర్చుకుంది.
- మురుగవాణి సంస్థ రూ.150 కోట్లతో 500 మందికి ఉపాధితో ఎకో టూరిజం రిసార్టులు ఏర్పాటు చేయనుంది.
- అకొంటిపై అంతర్జాతీయ సంస్థ రూ.243 కోట్లతో 100 మందికి ఉపాధి కల్పించేలా మెగా వీల్ ఏర్పాటు చేయనుంది.
- జలవిహార్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రూ.250 కోట్లతో 500 మందికి ఉపాధి కల్పిస్తూ అన్నవరం ప్రాంతంలో జలవిహార్ టూరిజం హార్బర్‌ని నిర్మించనుంది.
- రూ.122 కోట్లతో 255 మందికి ఉపాధి కల్పించేలా గారిసన్ సంస్థ కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.
- టర్కీకి చెందిన పోలిన్ అక్వేరియమ్స్ సంస్థ రూ.120 కోట్లతో 110 మందికి ఉపాధినందిస్తూ టన్నెల్ అక్వేరియంని నిర్మించనుంది.
- రూ.115.5 కోట్లతో 150 మందికి ఉపాధి కల్పించేలా ఎండాడలో భవానీ బీచ్ రిసార్టులు రానున్నాయి.
- రూ.100 కోట్లతో 50 మందికి ఉపాధి అందించేలా అకొంటిపై అంతర్జాతీయ సంస్థ స్కైటవర్‌ని ఏర్పాటు చేయనుంది.
- రూ.85 కోట్లతో 200 మందికి ఉపాధినందించేలా ఫ్రాన్స్‌కు చెందిన ఎరోఫైల్‌సంస్థ స్కై రెస్టారెంట్, స్కై డైవింగ్, సర్ఫింగ్, మినీ వాటర్‌పార్క్‌ని నిర్మించనుంది.
- రూ.25 కోట్లతో 30 మందికి ఉపాధి కల్పిస్తూ జపాన్‌కు చెందిన సంస్థ స్నో వరల్డ్ ఏర్పాటు చేయనుంది.
- రూ.500 కోట్లతో 500 మందికి ఉపాధినందించేలా స్వామి నారాయణ్ ట్రస్ట్ డివైన్ డెస్టినేషన్ ఫర్ స్పిరుచ్యువల్ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేయనుంది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఆస్పత్రిని తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- విధులకు హాజరు కాని వైద్యురాలు, అంబులెన్సు డ్రైవర్
- జీతం నిలిపివేతకు ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న పీవో గోపాలకృష్ణ

కొయ్యూరు: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ హెచ్చరించారు. సోమవారం ఆయన డౌనూరు ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్యుల హాజరు పట్టిని పరిశీలించారు. అయితే వైద్యురాలు లలిత, అంబులెన్స్ డ్రైవర్ కాంతారావు విధులకు రాకపోవడంతో వారి జీతాన్ని నిలిపివేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. విధులకు ఎగనామం పెడితే సహించేది లేదని హెచ్చరించారు. పలు రికార్డులు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మండల మహిళా సమాఖ్య సభ్యులు

చింతూరు: వైఎస్సార్ క్రాంతిపథం మండల మహిళా సమాఖ్య సభ్యులు సోమవారం చింతూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల హామీలో భాగంగా ఈ నెల 25న మూడో విడత ఆసరా సొమ్ము విడుదల చేస్తున్న నేపథ్యంలో ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. ఇవి ఆర్థికంగా తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, తూ.చా తప్పకుండా ఆసరా పథకం అమలు చేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఎం సోమినాయుడు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాడె జ్యోతి, కార్యదర్శి జయలక్ష్మి, గ్రామ సంఘాల లీడర్లు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి రాగి జావ



సాక్షి, పాడేరు: విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో పౌష్టికాహార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నుంచి బెల్లంతో తయారుచేసిన రాగి జావ పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 22మండలాల పరిధిలో 2704 ప్రభుత్వ పాఠశాలలు, యూపీ, ఉన్నత పాఠశాలల్లో 91,412 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ రాగి జావ ఉదయం 8.45 నుంచి 9గంటల లోపే పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

పాఠశాలల్లో మెనూ ఇలా..

సోమవారం : పొంగలి/బిర్యానీ, గుడ్డుకూర, వేరుశనగ చిక్కీ, **మంగళవారం:** పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ, **బుధవారం:** కూరగాయలతో అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ, **గురువారం:** సాంబార్ అన్నం/ నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు, రాగిజావ **శుక్రవారం:** అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గడ్డు, వేరుశనగ చిక్కీ, **శనివారం:** ఆకుకూర అన్నం, రసం, తీపి పొంగలి, రాగిజావ

హుండీల ఆదాయం రూ.2 లక్షలు

దేవీపట్నం: మండలంలోని గొందూరు గండిపోశమ్మ అమ్మవారి ఆలయంలో ఆరు హుండీలను సోమవారం లెక్కించారు. రూ.2,01,033 ఆదాయం సమకూరినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి. ప్రసాద్, ఈవో జి.వి.లక్ష్మీకుమార్ తెలిపారు. మూడు నెలలకు సంబంధించిన ఆదాయాన్ని లెక్కించామని వారు వివరించారు.

ఫలసాయానికి వేలం

రంపచోడవరం: పందిరిమామిడిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ రకాల పండ్ల మొక్కల ఫలసాయానికి వేలం నిర్వహిస్తున్నట్లు కేవీకే కోఆర్డినేటర్ డా.లలితాకామేశ్వరి తెలిపారు. ఈ నెల 27న మధ్యాహ్నం 1 గంటకు 90 మామిడి మొక్కలు, 31 సపోటా, 371 జీడిమామిడి, 90 నిమ్మ మొక్కలు ఫలసాయం పొందేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ధరావత్తు రూ. 5వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు కేవీకే కార్యాలయంలో తెలుసుకోవచ్చునన్నారు.

'బాడీ బిల్డింగ్' జిల్లా కార్యదర్శిగా సుబ్బారావు



నియామకం పత్రం అందుకుంటున్న కొట్టగుళ్లి సుబ్బారావు

పాడేరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా పాడేరు పట్టణానికి చెందిన కొట్టగుళ్లి సుబ్బారావు నియమితులయ్యారు. సోమవారం శ్రీకాకుళంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో అయనకు అసోసియేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు గురునాథరావు, కార్యదర్శి స్వామినాయుడు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 55 కేజీల విభాగంలో పాడేరుకు చెందిన కిముడు సూర్యప్రకాష్, 65 కేజీల విభాగంలో లకే శశిపాత్రుడు ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

లోకుల గాంధీ పేరిట పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కొయ్యూరు: బీజేపీ నేతలు దివంగత లోకుల గాంధీ పేరిట పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌లు ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గాంధీకి చెందిన తోడు ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఎం. మురళీకృష్ణ, ట్రస్ట్ అధ్యక్షుడు ఎల్.రమేష్ సోమవారం ఆయనను పాడేరులోని కలెక్టరేట్‌లో కలిశారు. ట్రస్టు పేరిట ఏర్పాటు చేయబోతున్న స్కాలర్ షిప్‌ల పోస్టర్‌ను కలెక్టర్‌తో ఆవిష్కరింపజేశారు. ట్రస్టు గౌరవ అధ్యక్షుడు లోకుల కిరణ్ పాల్గొన్నారు.

దాడులు సరి కాదు

- అసెంబ్లీ చరిత్రలోనే ఇది బ్లాక్ డే
- జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మహారాణిపేట: అసెంబ్లీ సమావేశాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత శాసనసభ్యుడు సుధాకర్‌పై టీడీపీ సభ్యులు దాడి చేయడాన్ని ఉమ్మడి విశాఖ జెడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దాడులు సరి కాదన్నారు. ప్రజా సమస్యలు చర్చించాల్సిన చోట శాసనసభ్యులపై వారు దాడులకు పాల్పడటాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టీడీపీ సభ్యులు పథకం ప్రకారం స్పీకర్‌పై పేపర్లు చించి విసిరారన్నారు. ఇది చంద్రబాబు వ్యూహం అని ఆమె ఆరోపించారు. సభలో అత్యంత గౌరవప్రదంగా చూడాల్సిన స్పీకర్ స్థానానికి కూడా విలువ ఇవ్వకుండా టీడీపీ నేతలు ప్రవర్తించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ నేత, దళిత శాసనసభ్యుడు సుధాకర్, డిప్యూటీ స్పీకర్ నారాయణ స్వామిపై భౌతికదాడులకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన టీడీపీ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

'అమ్రిత్ జలధార'కు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: అమ్రిత్ జలధార పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులైన ఎస్సీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డి.వి.రమణ మూర్తి తెలిపారు. సోమవారం జేసీ చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో పథకం అమలుపై సమీక్షించారు. 2.5 ఎకరాల భూమి ఉన్న ఎస్సీ రైతులు బోరు వేసుకునేందుకు రూ.50 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. ఎస్సీ నిరుద్యోగ యువతీ/యువకులు ఉపాధి కోసం ఆటో, ట్రాక్టర్ కొనుగోలు, కిరాణా షాపు, ఫొటో స్టూడియో టెంట్ హౌస్, మెడికల్ క్లినికల్ ల్యాబ్, బ్యాంగిల్ షాపు పెట్టుకునేందుకు రూ.60 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు.

రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసు పుస్తకం, ఆదాయ పత్రం సమర్పించాలని తెలిపారు. అర్హత గల వారు ఈ నెల 27వ తేదీ లోపు విశాఖ పట్నంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా దృష్టి సారించాలన్నారు. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.



సమీక్షిస్తున్న జేసీ విశ్వనాథన్, పథకంపై వివరిస్తున్న జేడీ రమణమూర్తి

పూర్తి వివరాలకు 8317559817 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రక్తహీనతపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా రక్తహీనత సమస్య ఉన్న పిల్లలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సోషల్ బి హేవినియర్ చేంజ్ కమ్యూనికేషన్ పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలో రక్తహీనత, అనర్థాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.70నుంచి 80శాతం పిల్లలు రక్తహీనత సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ఈ సమస్యను అధిగమించి ఆరోగ్యకరమైన సమాజం నిర్మించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐసీడీఎస్, వెలుగు, విద్య, వైద్య ఆరోగ్యశాఖ, గిరిజన సంక్షేమశాఖలు నిర్వహించే సమావేశాల్లో రక్తహీనత నివారణకు సంబంధించిన అంశాలపై మాట్లాడాలన్నారు. అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ 10 నుంచి 19ఏళ్ల యుక్తవయసు ఉన్న బాలికలపై ప్రత్యేకంగా దృష్టిసారించి, వారిలో రక్తహీనత సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ,గిరిజన సంక్షేమడీడీ కొండలరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఈవో సలీంబాషా, ఎల్‌డీఎం రవితేజ, సీపీవో ఆర్‌కే. పట్నాయక్, సమన్వయకర్త రమేష్ నాయుడు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు అధిక ప్రాధాన్యం

ప్రభుత్వ మార్గనిర్దేశకాల మేరకు జిల్లా వ్యాప్తంగా భూముల రీసర్వేకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీసర్వే,పీవీటీజీ ఓటర్ల నమోదుపై జిల్లా అధికారులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో పలు సూచనలు చేశారు. జిల్లాలో 485 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా 216 గ్రామాల్లో వెక్టరైజేషన్ పూర్తయ్యిందన్నారు. పీవీటీజీ ఓటర్ల నమోదు నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి మండలానికి రెండువేల ఫారం6, వెయ్యి ఫారం7పత్రాలను సరఫరా చేస్తామన్నారు.జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ,సబ్‌కలెక్టర్లు అభిషేక్,ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ,డీఆర్వో అంబేద్కర్,సర్వే ఏడీ మోహన్‌రావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

టెన్త్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

జిల్లాలో వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన తన కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో జూమ్ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 63 పరీక్ష కేంద్రాల్లో 11,522 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చింతపల్లి, జి.కె.వీధి అనంతగిరి, కొయ్యూరు మండలాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఎస్పీ సతీష్‌కుమార్, పాడేరు డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఈవో సలీమ్‌బాషా, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఆర్టీసీ డీఎం ఆర్.ఎస్.నాయుడు, విద్యుత్ పంపిణీ సంస్థ ఈఈ అప్పారావు పాల్గొన్నారు.

తీర్థయాత్రల పేరిట మోసం

- రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లి ఉడాయించిన ఇద్దరు వ్యక్తులు
- సుమారు రూ.6.5 లక్షల వసూలు
- టీటీడీ ఐడీ కార్డులతో నమ్మించారని బాధితుల వెల్లడి
- పోలీసులకు ఫిర్యాదు



తీర్థయాత్ర కోసం చెల్లించిన డబ్బుల రశీదులు



పెదబయలు పోలీసుస్టేషన్ వద్ద బాధితులు

పెదబయలు: ఇద్దరు వ్యక్తులు కాశీ తీర్థ యాత్ర పేరిట నమ్మబలికారు. ఒకొక్కరి నుంచి రూ.వేలల్లో వసూలు చేశారు. అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ వారిని వదిలి ఉడాయించారు. పథకం ప్రకారం బురిడీ కొట్టించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. అరకు ప్రాంతానికి చెందిన కొర్రా నాగేశ్వరరావు, పెదబయలు మండలానికి చెందిన చలపతిరావు తీర్థయాత్రలకు తీసుకువెళ్తామని ఏజెంట్లు అవతారం ఎత్తారు. పది రోజుల యాత్రలో కాశీ, అయోధ్య, ప్రయోగ, పూరీ, అరసవెల్లి, సింహాచలం, శ్రీకూర్మం తీసుకువెళ్లి తీసుకువస్తామని రెండు నెలల ముందు నుంచి ప్రచారం చేశారు. ఒకొక్కరి నుంచి సుమారు రూ.5వేలు రెండు దఫాలుగా వసూలు చేసినట్టు బాధితులు తెలిపారు. ఇలా పెదబయలు మండలం అడుగులపుట్టు, తమరడ, సీకరి, గలగండ, అరడకోట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలం కిలగాడ, పెదగూడ, బంగారుమెట్ట, తుస్సపల్లి, పడాల్‌పుట్టు, ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా సైవారం, చింగోయి, కోడిగింది, బెజ్జింగి, అండికల్, కుట్టిగుడ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 130 మంది నుంచి రూ.6.5 లక్షలు వసూలు చేసినట్టు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్లో గంటల తరబడి..

తీర్థయాత్రలకు డబ్బులు ఇచ్చిన వారంతా ఈ నెల 18వ తేదీ ఉదయం పాడేరు చేరుకున్నారు. అక్కడినుంచి వీరిని ఆ ఇద్దరు వ్యక్తులు రెండు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించి సాయంత్రం 7 గంటలకు అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లారు. వీరిని రైల్వేస్టేషన్‌లో ఉంచి టికెట్లు తెస్తామని వెళ్లిన ఏజెంట్లు కొర్రా నాగేశ్వరరావు, చలపతిరావు తిరిగి రాలేదు. వారికోసం మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు నిరీక్షించారు. వారు ఎంతకీ రాకపోవడంతో మోసపోయామని గుర్తించిన వారు లబోదిబోమని స్వగ్రామాలకు వెళ్లిపోయామని బాధితులు వివరించారు.

టీటీడీ ఐడీ కార్డుల పేరిట నమ్మించి..

తిరుమల తిరుపతి దేవస్థానం పేరిట ఇద్దరు ఏజెంట్లు ఐడీ కార్డులను తమకు ఇవ్వడంతో నమ్మాల్సి వచ్చిందని బాధితులు తెలిపారు. దీనిపై సోమవారం రెండు మండలాల బాధితులతో కలిసి పెదబయలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు వంతినిభ సత్యనారాయణ,కిముడు జ్యోతి,కొర్ర వెంకటరావు, భాస్కరరావు తెలిపారు. దీనిపై పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు. గతంలో వారు తీర్థయాత్రలకు తీసుకువెళ్లినట్టు సమాచారం ఉందని ఈసారి ఎందుకు ఇలా జరిగిందో విచారణ చేస్తామన్నారు. తదుపరి కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

13 గంటలు నిరీక్షణ



కాశీతోపాటు మరో 9 పుణ్య క్షేత్రాల దర్శనం చేయిస్తామని 10 రోజుల టూర్ అని నమ్మించారు. దీంతో రూ.5500 చెల్లించా. అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లి మమ్మల్ని వదిలి జారుకున్నారు. వారికోసం 13 గంటల పాటు నిరీక్షించాం. వారు ఎంతకీ రాకపోవడంతో మోసపోయామని గుర్తించాం.

– కిముడు జ్యోతి లక్ష్మి, బాధితురాలు, తుస్సపల్లి, ముంచంగిపుట్టు మండలం

టీటీడీ పేరిట దొంగ ఐడీ కార్డులు



కాశీ పుణ్యక్షేత్రాల దర్శనం టీటీడీ ఆధ్వర్యంలో జరిపిస్తామని చెప్పడంతో నమ్మాల్సి వచ్చింది. టీటీడీ పేరుతో ఎస్.కోటలో ఓ నెట్ సెంటర్‌లో ఐడీ కార్డులు తయారు చేయించినట్టు తెలిసింది. అవి నకిలీవిగా భావిస్తున్నాం. రైల్వేస్టేషన్లో వదిలేయడంతో ఒడిశా చెందిన వారు తెలుగు రాక అవస్థలు పడ్డారు.

– కొర్రా వెంకటరావు, బాధితుడు, పడాల్‌పుట్టు, ముంచంగిపుట్టు మండలం

నేటి నుంచి గ్రామసభలు

- తొలిదశలో అదనంగా 17 గ్రామాలు
- గతేడాది వరదల ఆధారంగా 41.15 కాంటూరుకు మార్పు

చింతూరు: తొలిదశ 41.15 కాంటూరు పరిధిలోకి మార్పు చేసిన 17 గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామసభలు ప్రారంభం కానున్నాయి. వీఆర్‌పురం మండలంలో తొమ్మిది, కూనవరం మండలంలో ఏడు గ్రామాలు, చింతూరు మండలంలో ఒక గ్రామంలో వచ్చే నెల రెండో తేదీ వరకు వీటిని నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామసభల్లో సామాజిక ఆర్థిక సర్వేలో నమోదు చేసిన కుటుంబాల వివరాలు, గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు పరిహారం, పునరావాస వివరాలను చర్చించనున్నారు.

అదనంగా 17 గ్రామాలు:...

గతేడాది సంభవించిన వరదలకు పోలవరం ముంపునకు సంబంధం లేకుండా చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాల్లో పలు గ్రామాలు గోదావరి ముంపునకు గురయ్యాయి. దీంతో తమ గ్రామాలను తొలిదశలో కలిపి నష్టపరిహారం ఇవ్వాలని బాధిత ప్రజలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. ప్రాధాన్యతా క్రమంలో కొన్ని గ్రామాలను 45.72 కాంటూరు నుంచి 41.15 కాంటూరు పరిధిలోకి చేర్చాలని కలెక్టర్ ప్రభుత్వానికి ఓ నివేదిక అందించారు. దీంతోపాటు వరద ప్రాంతాల పర్యటనకు చింతూరు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముంపు గ్రామాల పరిస్థితిని జిల్లా అధికారులు వివరించారు. దీనిపై అధ్యయనం చేసి ఎట్టకేలకు గతంలో 41.15 కాంటూరు పరిధిలో ముంపునకు గురవుతున్న 67 గ్రామాలకు అదనంగా మరో 17 గ్రామాలను చేరుస్తూ ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. అదనంగా చేర్చిన సదరు గ్రామాల్లో ప్రస్తుతం గ్రామసభలు నిర్వహించాలని పోలవరం అడ్మినిస్ట్రేటివ్ అధికారి, స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య ఇటీవల ఆదేశాలు జారీ చేశారు.


గతేడాది వరదలకు నీటమునిగిన వీఆర్‌పురం మండలం ధర్మతాళ్లగూడెం(ఫైల్)

గ్రామసభల వివరాలు ఇలా:

గ్రామం	కుటుంబాల సంఖ్య	తేదీ
వీఆర్‌పురం మండలం:		
రామవరప్పాడు	257	- మార్చి 21
ప్రత్తిపాక	185	- మార్చి 23
గుండుగూడెం	153	-మార్చి 24
ధర్మతాళ్లగూడెం	278	- మార్చి 25
రాజుపేట కాలనీ	663	-మార్చి 27
అడవి వెంకన్నగూడెం	295	- మార్చి 28
చింతరేగుపల్లి	439	- మార్చి 29
వడ్డిగూడెం	947	- మార్చి 31
వీఆర్‌పురం	1,795	- ఏప్రిల్ 02
కూనవరం మండలం:		
పంద్రాజుపల్లి	30	- మార్చి 21
కొండ్రాజుపేట	223	- మార్చి 23
టేకుబాక	246	- మార్చి 24
శబరికొత్తగూడెం	434	- మార్చి 25
పెదార్కూరు	560	- మార్చి 27
టేకులబోరు	1,038	- మార్చి 28
కూనవరం	1,452	- మార్చి 31
చింతూరు మండలం:		
చింతూరు	1,918	- మార్చి 27

త్వరగా పరిహారం అందించాలి

శబరినది పక్కనే ఉండటంతో ఏటా వరదలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. తొలిదశ కాంటూరులో కలిపిన మా గ్రామానికి త్వరగా పరిహారం అందిస్తే వరద బాధల నుంచి విముక్తులవుతాం.



– నీలాపు సంధ్యారాణి, శబరిఒడ్డు, చింతూరు మండలం

తొలిదశలో చేర్చడం హర్షణీయం

ఏటా వరదల కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. గతేడాది వచ్చిన వరదలకు మా గ్రామం పూర్తిగా ముంపునకు గురైంది. రెండోదశ ముంపులో నున్న మా గ్రామాన్ని తొలి దశలో చేర్చడం హర్షణీయం.



– సున్నం రాజు, ధర్మతాళ్లగూడెం, వీఆర్‌పురం మండలం

గ్రామసభలకు ఏర్పాట్లు

అదనంగా చేర్చిన గ్రామాల్లో గ్రామసభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ప్రజలకు సమాచారం అందించాం.

– అనసూయ, తహసీల్దార్, కూనవరం మండలం

కొడుకు మృతిపై దర్యాప్తు కోరుతూ తల్లి ఆందోళన


ధర్నా చేస్తున్న మృతుడి తల్లి కృప, మద్దతు పలికిన పలు మహిళా సంఘాలు

చోడవరం : తన కొడుకు అనుమానాస్పద మృతిపై దర్యాప్తు చేసి, వెంటనే నిందితులను అరెస్టు చేయాలని కోరుతూ మృతుడి తల్లి సోమాదుల కృప చోడవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఆమెకు పలు ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. గత నెల చోడవరం లక్ష్మీదేవిపేటకు చెందిన సోమాదుల రాజేష్(22) అనే యువకుడు బీఎన్‌రోడ్డుపై గజపతినగరం వద్ద రోడ్డుపై మృతి చెంది పడి ఉన్నాడు. మొదట రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు అందరూ భావించగా తర్వాత ఆమె తల్లి సోమాదుల కృప తన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందలేదని, కొందరు అతనిని చంపి రోడ్డుపై పడేశారని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో చోడవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో అనుమానం వ్యక్తం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయలేదని ఆరోపిస్తూ తనకు న్యాయం చేయాలని కోరుతూ మృతుడి తల్లి కృప చోడవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కృపకు మద్దతుగా విశాఖ మహిళా వేదిక అధ్యక్షురాలు, ప్రముఖ న్యాయవాది కె.కుసుమ, స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు మద్దతు పలికారు. చోడవరానికి చెందిన ఇద్దరు యువకులతోపాటు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక వ్యక్తి కూడా తన కొడుకు మృతికి కారణమని మృతుడి తల్లి అనుమానం వ్యక్తం చేశారు. తన కొడుకును హత్యచేశారని, పోలీసులు మాత్రం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ కేసులో వెంటనే దర్యాప్తు చేసి తనకు న్యాయం చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కేసుపై స్థానిక పోలీసు, రెవిన్యూ అధికారులు స్పందించకపోతే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని మహిళా వేదిక అధ్యక్షురాలు కుసుమ అన్నారు. అనంతరం తహసీల్దార్ తిరుమలరావుకు వినతి పత్రం అందజేశారు.

పోషణ్ పక్వాడాతో సంక్షేమం

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా బాలికలు, యువతుల సంక్షేమమే లక్ష్యంగా పోషణ్ పక్వాడా కార్యక్రమం చేపడుతున్నామని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో సోమవారం బాలికలతో నిర్వహించిన సమావేశంలో ఆమె బాల్య వివాహాల అనర్థాలు, పౌష్టికాహారం, రక్తహీనత తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. బాలికలంతా పూర్తిస్థాయిలో పౌష్టికాహారం పొందాలన్నారు. ప్రభుత్వం అమలు జేస్తున్న మెనూ ప్రకారం హస్టల్ వార్డెన్లు, మేట్రిన్లు కూడా నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేయాలని సూచించారు. రక్తహీనత సమస్య లేకుండా బాలికల సంక్షేమం లక్ష్యంగా పనిచేయాలన్నారు. రక్తహీనత సమస్యతో బాధపడే విద్యార్థినులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, సీడీపీవో ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు రమణి, కవిత, చెల్లాయమ్మ, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

రూ.70 వేలు చోరీ

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి జోగునాథుని పాలెం వద్ద పెప్సీ గోడౌన్‌లో చోరీ జరిగిందని టౌన్ ఎస్ఐ గోవిందరావు తెలిపారు. గోడౌన్‌లోని క్యాష్ కౌంటర్‌లో రూ.70,800 ఉంచారు. ఈ నగదు మాయమైందని నిర్వాహకుడు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముంచెత్తిన వాన

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గత ఆరు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ప్రధాన గెడ్డలు, వాగులతో నీటి ఉధృతి అధికమైంది. లోతట్టుప్రాంతాలు జలమయం అయ్యాయి. సోమవారం ఉదయం ఎండ నెలకొంది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి వర్షం ప్రారంభమైంది. సాయంత్రం నుంచి పాడేరు పట్టణంతో పాటు, సమీప గ్రామాల్లో గంట పాటు కుండపోతగా కురిసింది.

జిల్లాలో 290 ఎంఎం నమోదు

జిల్లాలో సోమవారం ఉదయం 290 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.రంపచోడవరంలో 44.8, రాజవొమ్మంగిలో 38.4, గంగవరంలో 34.4, దేవీపట్నంలో 33.2, అడ్డతీగలలో 26.6, కొయ్యూరులో 20.2, ముంచంగిపుట్టులో 16.2, జి.మాడుగులలో 10.4, వి.ఆర్.పురంలో 10.8, పాడేరులో 7.2, పెదబయలులో 8.6, డుంబ్రిగుడలో 5.8, అరకులోయలో 6.2, అనంతగిరిలో 4.6, హుకుంపేటలో 6.4, చింతపల్లిలో 5.2, జి.కే.వీధిలో 2.6, మారేడుమిల్లిలో 2.2, వై.రామవరంలో 3.4, కూనవరంలో 1.2, ఎటపాకలో ఒకటి, చింతూరులో 0.6 ఎంఎం నమోదైందని అధికారులు తెలిపారు.

గంజాయి నిందితుడు అరెస్ట్


నిందితుడు రవీందర్‌తో ఎస్ఐ సంతోష్

అరకులోయ రూరల్: గంజాయి నిందితుడు కిల్లో రవీందర్‌ను అరెస్ట్ చేసినట్లు అరకు లోయ ఎస్ఐ సంతోష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కులసింగ్ గ్రామానికి చెందిన కిల్లో రవీందర్ 2022లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి 6 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ముద్దాయిగా ఉన్నట్టు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడిని తాజాగా అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


శ్రీనుకి వైద్యం చేస్తున్న వైద్యులు

అనకాపల్లిటౌన్: డీబీ కాలనీకి చెందిన బండి శ్రీను(39) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ వివరాల ప్రకారం .. అతడు మొదటి భార్య కాకినాడ ఉండగా, రెండో భార్య వెంకటలక్ష్మితో కలిసి శ్రీను ఉంటున్నాడని ఎస్ఐ చెప్పారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీను పురుగుమందు సేవించినట్లు తెలుసుకున్న వెంకటలక్ష్మి అతన్ని వెంటనే ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీనును విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అతను మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరిగి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఘటనపై వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గోస్తనీ నదిలో తెప్ప బోల్తాపడి గిరిజనుడి మృతి


రాంబాబు మృతదేహం

అనంతగిరి : చేపలవేటలో విషాదం నెలకొంది. జీలుగులపాడు సమీపంలోని గోస్తనీ నది వద్ద తెప్ప బోల్తాపడి గిరిజనుడు ఊబిలో చిక్కుకుని మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ జీలుగులపాడు గ్రామానికి చెందిన యనమల రాంబాబు(35) అనే గిరిజనుడు, గ్రామ సమీపంలోగల గోస్తనీ నది వద్ద చేపట వేటకు ఉదయం వెళ్లాడు. నదిలో చేపలవేటలో ఉండగా, ప్రమాదవశాత్తూ తెప్పబోల్తాపడడంతో లోతు ప్రదేశంలోని ఊబిలో చిక్కుకుని రాంబాబు మునిగిపోయాడు. వేటకు వెళ్లిన గ్రామ గిరిజనులు తెప్పబోల్తాపడి ఉండడం చూసి, కుటుంబ సభ్యులకు సమచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించిన వెంటనే అనంతగిరి ఎస్ఐ కరక రాము నది వద్దకు చేరుకుని, స్థానికులతో గాలింపు చర్యలు చేపట్టారు. రాంబాబు మృతదేహం లభ్యం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్‌కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ప్రమాదవశాత్తూ జారిపడి గర్భిణి మృతి

చింతపల్లి : ఆరు నెలల గర్భిణీ ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలివి. మండలంలోని తాజంగి పంచాయతీ చెరువీధి గ్రామానికి చెందిన పాంగి దానిమ్మ(30) ఇంటి బయట ప్రమాదవశాత్తూ జారిపడి అపస్మారకస్థితికి చేరుకుంది. వెనువెంటనే ఆమెను కుటుంబ సభ్యులు 108లో వాహనంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే దానిమ్మ మృతి చెందినట్టు వైద్యాధికారి కీర్తి నిర్ధారించారు. ఆరు నెలల గర్భిణీగా ఉన్న దానిమ్మకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. దానిమ్మ మృతితో చెరువీధి గ్రామంలోని విషాదం నెలకొంది. ఏరియా ఆస్పత్రిలోని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా గర్భిణీ దానిమ్మ మృతిపై వైద్య సిబ్బంది నుంచి ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ వివరాలను ఆరా తీశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఏరియా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పిస్తాం

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ


ఏరియా ఆస్పత్రిలో వసతులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

చింతపల్లి: ఏరియా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన వైద్య పరికరాలు అందిస్తామన్నారు. శస్త్రచికిత్సలు చేయడానికి థియేటర్‌ను సిద్ధం చేయాలన్నారు. ఏపీ ఎస్ఎంఐడీసీ నుంచి సరఫరా చేసిన ఉపకరణాలను వినియోగించాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. వైద్య సిబ్బంది ఖాళీలను అడిగి తెలుసుకున్నారు. వీటిని భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం లంబసింగి, తాజంగి, సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది అందబాటులో ఉంటూ సేవలందించాలని, సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కీర్తి, వైద్యాధికారి శంకర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పూర్తయిన స్నానాల ఘాట్


నిర్మాణం పూర్తయిన స్నానాల ఘాట్

సీలేరు: స్థానిక గ్రామదేవత మారెమ్మతల్లి ఆలయం ఎదుట పుణ్యస్నానాలు ఘాట్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి చొరవతో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో ఇక్కడ రిజర్వాయర్‌ను ఆనుకుని పుణ్యస్నానాల ఘాట్ నిర్మించారు. ఈ పనులు సోమవారంతో పూర్తయ్యాయి. తమిళనాడు నుంచి తరలివచ్చి ఇక్కడ కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు ఏటా వేలాది మంది వస్తుంటారు. ఈ నేపథ్యంలో స్నానాల ఘాట్ నిర్మాణం గురించి ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను గతంలో కోరగా, ఆమె నిధులు మంజూరు చేశారు. అదేవిధంగా మన్యం శబరిమలైగా భాసిల్లుతున్న అయ్యప్ప స్వామి ఆలయం ఇక్కడ అమ్మవారి ఆలయం పక్కనే ఉంది.

మతిస్థిమితం లేక కత్తితో పొడుచుకుని...

- యువకుడి పరిస్థితి విషమం
- పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు
- ముంచంగిపుట్టులో ఘటన


విషమంగా ఉన్న యువకుడు శ్యామ్

ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో మతిస్థిమితం లేని గిరిజన యువకుడు వింత చేష్టలు చేశాడు.అందరూ చూస్తూ ఉండగానే రెండు కత్తులతో తనకు తానే పొడుచుకుని భయభ్రాంతులకు గురి చేశాడు. వివరాలివి. మారుమూల లక్ష్మీపురం పంచాయతీ కర్లాపోదర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు మండి శ్యామ్(22)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. సోమవారం మండల కేంద్రానికి వచ్చిన శ్యామ్ షాపులో రెండు కత్తులను కొనుగోలు చేశాడు. మతిస్థిమితం సక్రమంగా లేకపోడం కత్తులతో మెడ, పొట్ట, ఛాతి భాగాల్లో పొడుచుకొని గాయాలు చేసుకున్నాడు. దీనిని చూసిన స్థానికులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే శ్యామ్‌ను ప్రైవేట్ వాహనంలో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. వైద్య సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. కత్తి గాట్లు బలంగా శరీరంలోకి వెళ్లిపోవడంతో తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో యువకుడి పరిస్థితి విషయంగా మారింది.మెరుగైన వైద్య సేవలు నిమిత్తం అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మతిస్థిమితం లేని శ్యామ్ ఇప్పటికే పలుమార్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేశాడని కర్లపాదర్ గ్రామస్తులు తెలిపారు.

కాఫీ రైతులకు మెరుగ్గా ఆదాయం


హాజరైన కాఫీ అధికారులు

పాడేరు రూరల్ : కాఫీ రైతులకు ఆదాయం పెంపు లక్ష్యంగా సేవలందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ జయంతి ఘోష్ అధ్యక్షతన కాఫీ లైజన్ వర్కర్లకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో రైతులకు వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా రైతు ఆదాయం పెరిగేలా కృషి చేయాలన్నారు. ఏజెన్సీలో కాఫీ సాగు అభివృద్ధికి ఐటీడీఏ, స్పైసెస్ బోర్డులు కృషి చేయాలన్నారు.ఆర్‌వీ నగర్ ఆర్ఆర్ఎస్ డీడీ డాక్టర్ అటిఖర్ రెహ్మాన్ బోరా, నిపుణుడు డి. సునీల్‌బాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కాఫీ సాగులో మెలకువలు, సస్యరక్షణ, కాండం తొలుచు పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఎస్ఎల్‌వో విష్ణు, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, సీహెచ్‌వో ఎన్. అశోక్, కాఫీ విస్తరణ ఇన్‌స్పెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


ఘటనాస్థలిలో ఈశ్వరరావు మృతదేహం (ఇన్‌సెట్) ఈశ్వరరావు (ఫైల్)


అనకాపల్లిటౌన్: సబ్బవరం మండలం అసకపల్లి గ్రామానికి చెందిన డి.ఈశ్వరరావు(55) రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. రూరల్ హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య అందించిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం–అనకాపల్లి జాతీయ రహదారిలో శంకరం గ్రామం వద్ద సోమవారం తన ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వైపు వస్తుండగా ఆ వ్యక్తిని వెనుక నుంచి వచ్చి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ చెప్పారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరగ్గా, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

యలమంచిలి : ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన యలమంచిలి మండలం రేగుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. తుని ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ షేక్‌అబ్దుల్ మారుఫ్ తెలిపిన వివరాలివి. అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే గుర్తుతెలియని రైలు నుంచి రేగుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో (52) సంవత్సరాలు ఉన్న వ్యక్తి జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియలేదు. తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ టీషర్టు, ట్రాక్ ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని ఆచూకీ తెలిస్తే తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్‌లో గాని ఫోన్ నెంబర్లు, 9490619020, 9494887786లకు గాని సంప్రదించాలని ఆయన కోరారు.

చోడపల్లి వద్ద కొండచిలువ కలకలం


రోడ్డుపై పాకుతున్న కొండచిలువ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి వద్ద కొండచిలువ కలకలం సృష్టించింది. ఆదివారం రాత్రి సమయంలో రోడ్డుపై వెళుతున్న కొండ చిలువను చూసి స్థానికులు బెంబేలెత్తారు. అది ఎటు వెళ్తుందో అంటూ ఆందోళనకు గురయ్యారు.